


# నిన్నటి పున్నమి

1980లలో రచయితగా ఎదిగాక నన్ను చాలామంది అడిగేవారు.

"మీకో సెక్రటరీ ఉందా?"

ఉంది ఇప్పటికీ ఉంది. ఆ సెక్రటరీ పేరు ఆసక్తి. ఆ ఆసక్తి వల్లే ఎన్నో విషయాలని తెలుసుకోగలిగాను. తెలుసుకున్నవి కథల్లో, నవలల్లో రాయగలిగాను. ఆసక్తి అనే నా సెక్రటరీ నాకు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ మిస్టరీ మేగజైన్, ఎల్లరీ క్వీన్స్ మిస్టరీ వీకెండ్‌లాంటి పత్రికలని పరిచయం చేసింది.




2000కి మా పెద్దమ్మాయి కావ్యకి పదిహేనేళ్ళు వచ్చాయి. 13వ ఏడుదాకా ఆగస్ట్ 19న తన పుట్టినరోజుకి మా కుటుంబ సభ్యులంతా రాత్రి భోజనానికి రెస్టారెంట్‌కి వెళ్ళేవాళ్ళం. పదిహేనో ఏడు తన ఫ్రెండ్స్‌తో వెళ్తానంటే సరే అన్నాం. అంతకు మునుపు పధ్నాలుగో ఏడు కూడా మాతో కాకుండా తన క్లాస్‌మేట్స్‌తో అలా పుట్టినరోజు రాత్రి డిన్నర్‌కి వెళ్ళింది. నా బాధని గ్రహించాక పద్మజ చెప్పింది.

"పిల్లలు పెద్దవాళ్ళయ్యాక వాళ్ళకి వ్యక్తిగత జీవితం ఏర్పడుతుంది. తర్వాత వాళ్ళు మనమీద ఆధారపడరు."

ఈ జీవితసత్యాన్ని గురించి కొంత ఆలోచించాను. నా విషయంలో, లోకంలో అంతటా జరిగేది ఇదే అని గ్రహించాను. అందుకు కొంత సమయం పట్టింది. అదే సమయంలో పెద్దవాళ్ళైన తల్లితండ్రుల అదుపాజ్ఞల్లో ఉన్న పిల్లలు కూడా నాకు తారసపడ్డారు.

"నేను జీవించి ఉండగానే మావారు పోతే బావుండును. నా తర్వాత ఆయన్ని పిల్లలు సరిగ్గా చూడరు. ఈయనకి లౌక్యం తెలీదు." అనే మా బంధువుల్లోని ఒకరి మాటలు కూడా అదే సమయంలో విన్నాను.

నా మనసులో ఈ విషయాల మీద కొంత ఘర్షణ జరిగింది. దాంట్లోంచి పుట్టిన నవల నిన్నటి పున్నమి.

ఆంధ్రసచిత్ర వార పత్రికని అమ్మేసాక శివలెంక రాధాకృష్ణగారు మద్రాస్ నుంచి ప్రియదత్త అనే వారపత్రికని తెస్తున్నారని, దానికో సీరియల్ రాయమని దాని ఎడిటర్ - ఒకప్పటి ఆంధ్రసచిత్రవార పత్రికలో సబ్ ఎడిటర్ శ్రీ ఎం. మాధవరావు నాకు ఉత్తరం రాసారు. నాకు ఆయనంటే గౌరవం. నా కథలని తిప్పి పంపాక కలిస్తే వాటి ప్రస్తావన తెచ్చి ఎందుకు నచ్చలేదో చెప్పేవారు. నా కథని ప్రచురిస్తున్నామని ఓ ఎడిటర్‌నుంచి నేను అందుకున్న మొదటి లేఖ కూడా ఆయననించే వచ్చింది. దాంతో అంగీకరించాను.

'నిన్నటి పున్నమి' థీమ్ రాసి పంపాను. అది రాధాకృష్ణగారికి నచ్చిందని, వెంటనే ఆరంభించమని మాధవరావుగారు నాకు ఫోన్ చేసి చెప్పారు. 2001లో ఆరంభమైన ఆ వారపత్రిక మొదటి మూడు సంచికల్లో ప్రకటన ఇచ్చాక నాలుగో సంచికనుండి నిన్నటి పున్నమి ఆరంభమైంది. సూక్ష్మంగా కథ.

మూడేళ్ళకితం మరణించిన తన మిత్రుడు పతంజలి అతని మిత్రుడు లక్ష్మణరావు గౌహతిలో అకస్మాత్తుగా చూస్తాడు. తను మరణించకుండానే ఎందుకు అలా అందర్నీ నమ్మించి మాయం అయాడో పతంజలి తన మిత్రుడికి చెప్పే కథే ఈ నవల. ఫ్లేష్‌బాక్ పూర్తయ్యాక లక్ష్మణరావు పతంజలి చేసిందానితో ఏకీభవించి ఆయన రహస్యాన్ని కాపాడతానని మాట ఇస్తాడు.




ఎప్పటిలా మధ్యతరగతి పాత్రలతో, ఆ నేపథ్యంలో వారి సెంటిమెంట్లతో రాసిన ఈ కుటుంబ కథలో సస్పెన్స్‌కి కూడా అవకాశం దొరికింది. చాలా కుటుంబాల్లోలా పతంజలి భార్య పూసలదండలోని దారం. పూసల దండ తెగిపోయాక పూసలన్నీ చెల్లాచెదురైనట్లుగా ఆమె మరణించాక పిల్లలు, తండ్రికి దూరం అవుతారు.

పెళ్ళయ్యాక తమ భార్యాపిల్లలే తమ కుటుంబంగా భావించి, అందులో తండ్రిని కలపని, ఆయన్ని సరిగ్గా చూడని కొడుకులు కూడా ప్రధానపాత్రలు. ఆయన పేరున ఉన్న ఇంటిని అపార్ట్‌మెంట్స్ కట్టడానికి అమ్మమని ఓ కొడుకు వత్తిడి తెస్తాడు. ఆర్థికంగా తప్ప మిగిలిన అన్నిటికీ వాళ్ళమీద ఆధారపడ్డ పతంజలిది కాదనలేని నిస్సహాయస్థితి. తనకి మద్దతు ఇచ్చే భార్య లేదు. ఈ పరిస్థితుల్లో తన పిల్లల మధ్య ఇమడలేని పతంజలి వారి మధ్యనించి తప్పుకుంటాడు. ఓ సంస్థకి డబ్బు చెల్లించి తను మరణించినట్లుగా ఋజువులు ఏర్పాటు చేసుకుని తను వెదికి సంపాదించుకున్న కర్నాటకలోని ఓ కొత్త కుటుంబం దగ్గరకి తను సంపాదించిన యావదాస్థితో వెళ్ళి వాళ్ళతో అక్కడ ప్రశాంతంగా జీవిస్తాడు.

1998లో వీకెండ్ వారపత్రికలో ఓ వ్యాసం చదివాను. అందులో ఓ మనిషి మరణించినట్లుగా ఋజువులు సృష్టించి మాయం చేసి, కొత్త ప్రదేశంలో స్థిరపడేందుకు సహాయం చేసే వ్యాపార సంస్థ గురించి రాసారు. ఐతే నేరస్థులకి, అప్పులు చేసి పారిపోదామని అనుకునే వాళ్ళకి కాక కేవలం చట్టబద్ధంగా వ్యక్తిగత కారణాల వల్ల మాయమైతే తమ సమస్యలన్నీ తీరతాయి అనుకునేవారికే కొంత రుసుముకి ఆ వ్యాపార సంస్థ ఆ సహాయం చేస్తుంది. ఇలాంటి వింత వ్యాపారాలు అమెరికా, జపాన్‌లాంటి దేశాల్లో మామూలే. దాన్ని ఈ నవల్లో సస్పెన్స్ కోసం వాడుకున్నాను. ధైర్యం చేసే వాళ్ళకి ఓ పరిష్కారం కూడా. ఈ నవల్లో నేను రాసిన అనేక సమస్యల్లో 60+ పాఠకులు ఒకటి, రెండైనా ఫేస్ చేస్తూంటారని నా నమ్మకం.

ఇది చిన్న నవల. 184 పేజీలు. అంతకంటే ఎక్కువరాసే అవకాశం లేని నవల. ఈ కుటుంబ నవలని పాఠకులు ఆదరించారు. ఇప్పటికి నాలుగు ముద్రణలు వెలువడ్డాయి. మొదటిది నవంబర్ 2001లో లిపి పబ్లికేషన్స్ వెలువరించింది. 50 రూపాయలు. తాజాగా 2011లో వెలువడింది. 100రూపాయలు. ఈ ఎడిషన్ కూడా పూర్తిగా అమ్ముడైపోయింది.

www.anandbooks.com

www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments